క్లుప్తంగా

గాయపడిన చిన్నారికి ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకురుచెట్టుతండాకు చెందిన అనిత, హన్మంత్ దంపతుల రెండున్నరేళ్ల కూతురు వారం రోజుల క్రితం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వారి కుటుంబ పరిస్థితిని సర్పంచ్ రాధాకృష్ణ ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి తక్షణ సాయం కింద రూ.5వేలు అందజేశారు. రానున్న రోజుల్లో తండాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ఎంపీపీ భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ఐ.సత్యారెడ్డి, తిరుపతిరెడ్డి, శివయాదవ్, తిరుపతయ్య ఉన్నారు.

వైద్య శిబిరం



మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఎన్సీడి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ భవాని గ్రామంలోని బీపీ, షుగర్ పేషెంట్లను గుర్తించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నర్సింహ్మస్వామికి ప్రత్యేక పూజలు



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని శంకర్‌గంజ్‌లోని లక్ష్మీనరసింహా ఆలయంలో గురువారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు స్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన పూజలకు మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ హాజరై స్వామికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అష్టోత్తరం , మహా మంగళహారతి, భక్తి పాటలతో భక్తులు లక్ష్మీ నరసింహాస్వామిని పూజించారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



ఆత్మకూర్: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. గురువారం మండలంలోని పిన్నంచర్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో, మూలమల్లలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా మేడే వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు వేర్వేరుగా జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు విజయరాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రాజు, రాబర్ట్, రాజన్న, కృష్ణ, మోష, భీమన్న, చిన్నరమేష్, దేవరాజు, శ్యామూల్, జీవరత్నం , మహేష్, వెంకటన్న, రామకృష్ణ, హన్మంతు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు



మదనాపురం: మే డే వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ, బొడ్డెమ్మ పోటీలను నిర్వహించారు. మానసిక ఉల్లాసానికి ఈ పోటీలు ఎంతో దోహదపడుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, అలివేల, స్వప్న, పద్మ, శ్రీలత, రజిత, రూప తదితరులు పాల్గొన్నారు.

రూ. 44 వేల విలువైన వస్తువుల చోరీ

వనపర్తి: మండలంలోని సవాయిగూడెంలో గురువారం తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.44 వేల విలువగల వస్తువులను చోరీ చేశారు. రూరల్ ఎస్ఐ రామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి తాళం వేసి వనపర్తికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి తెరుచుకుని ఉన్న ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



కదిరెపాడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి



పెద్దమందడిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



కంభాళాపురంలో..

పాన్‌గల్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యంతో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని డీసీసీబీ డైరెక్టర్, విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కదిరెపాడులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు కేంద్రాల్లో అక్కడక్కడ కొంత ధాన్యానికి నష్టం వాటిల్లిందని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రాల్లో సిబ్బంది ధాన్యం తూకంలో జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీ నాగమ్మ, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: అకాల వర్షాల కారణంగా రైతులు పండించిన వరిధాన్యం తడిసిపోయిందని, దీనికి రైతులు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని ధాన్యాన్ని ఆరబెడితే తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పెద్దమందడి పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దమందడి మండల కేంద్రంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్షాలు రైతుల్లో అభద్రత భావం కలిగించడం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతుకు గౌరవం, గుర్తింపు వచ్చిందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు, రైతులు ఆదరిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లాలో రైతులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ఎక్కడ అవసరం ఉన్నా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారని తెలిపారు.

పెబ్బేరు రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సర్పంచ్ మంజుల అధికారులకు సూచించారు. శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో గురువారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ ఎల్లస్వామితో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, ప్రమోద్‌రెడ్డి, పెంటయ్య, రాముడు, స్వామి, నరసింహ, చంద్రయ్య, కృష్ణయ్య, స్వామి, రాజు, జీవన్, పోషన్న, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని ఎత్తివేసే కుట్రలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న మేకల ఆంజనేయులు

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర పన్నుతుందని, ఆ కుట్రలను ప్రజలు, కూలీలు కలిసి తిప్పికొట్టాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సభ్యుడు మేకల ఆంజనేయులు అన్నారు. గురువారం సంగినేనిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో కూలీలకు కనీస వేతనం కూడా రావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రోజువారీగా రూ.600 కూలి చెల్లించాలని, 200 పనిదినాలనను కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలకు రావాల్సిన డబ్బులు నెలలుగా పెండింగ్‌లో ఉంటున్నాయని, వెంటనే ఆ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వడగాల్పులపై అవగాహన



చిన్నంబావి: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాలు, సమాచార శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం వారు గురువారం మండలంలోని చెల్లెపాడు, వెంకటాంపల్లి గ్రామాల్లో వడదెబ్బ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం, అకాల వర్షాలు, పిడుగు పాట్లు, వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బోనాసి రాజు, శ్రీనివాసులు, లింగమయ్య, నర్సింహ, కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో కంపోస్ట్ ఎరువులే వాడాలి



వల్లభాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రావణ్‌కుమార్

వీపనగండ్ల: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఏపుగా పెరిగేందుకు కంపోస్టు ఎరువులను స్వయంగా తయారు చేసి, ఆ ఎరువులనే మొక్కలకు వాడాలని జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రావన్‌కుమార్ అన్నారు. గురువారం వల్లభాపురంలో పల్లెప్రకృతి వనాలతో పాటు గ్రామపంచాయతీ సమీపంలో నిర్మిస్తున్న ఫీడర్ చానల్ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలని ఆయన ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కంపోస్ట్ ఎరువుల తయారీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించడమే కాక మొక్కల పెంపకంలో కంపోస్ట్ ఎరువులను వాడడం వల్ల కలిగే ప్రయోజనాలను వన సేవకులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, ఏపీఓ శేఖర్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం ఎంపీటీసీ సభ్యులు శ్యామల, సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు అందజేశారు. శిరీషకు రూ.19 వేలు, చందనకు రూ. 26 వేలు, బాల్‌రెడ్డికి రూ.60 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేష్, హన్మంతురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డబ్బావెంకటయ్య, రాంగోపాల్, వినోద్‌గౌడు, ఆశోక్‌నాయుడు, భీరయ్య, కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ‘ఆధార్’ అప్‌డేట్ చేసుకోవాలి



అన్నారంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి



బౌసింగ్‌తండాలో..

పాన్‌గల్: ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి అన్నారు. గురువారం మండలంలోని అన్నారం జీపీ భవనంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆయన సర్పంచ్ రాములుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీఆర్ఏ సురేష్‌కుమార్, కురుమూర్తి, ఆధార్ కేంద్రం నిర్వాహకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని బౌసింగ్‌తండా పంచాయతీలో గురువారం ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో తహసీల్దార్ నరేందర్ మాట్లాడుతూ 2010 సంవత్సరం తర్వాత ఆధార్ పొందిన ప్రతి వ్యక్తి అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. అడ్రస్, ఫోన్ నెంబర్, పేరు తదితర వాటిని ఆధార్‌లో సరిచేసుకోవాలన్నారు. శుక్రవారం దంతనూరులో నిర్వహిస్తామని వెల్లడించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ చెన్నయ్య గురువారం పరిశీలించారు. మన ఊరు మన బడి నిధుల ద్వారా నిర్మిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులన్నీ పూర్తయితే తరగతి గదులతో పాటు విద్యార్థులకు డైనింగ్ హాల్ వసతి కూడా అందుబాటులోకి వస్తుందన్నారు.

రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసి రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆయన గురువారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వర్షానికి వేరుశనగ పూర్తిగా బూజు వచ్చి నల్లగా మారి కుళ్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల విషయంలో రాజకీయాలు మానుకొని నిజాయతీగా రైతుల పక్షాన నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ దామోదర్, ఏఓ వినయ్, అధికారులు గురువారం పర్యటించి రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా వరితో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈసందర్భంగా పంటను కోత వరకు ఏవిధంగా కాపాడుకోవాలో సూచించినట్లు తెలిపారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరగా కోతలు ముగించుకోవాలని, ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లను కప్పుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శివకుమార్, సింధు, హరిత ఉన్నారు.

సమస్యలు అధిగమించి అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: ప్రజాప్రతినిధులు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి సాధించాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వ సభ్యసమావేశం ఎంపీపీ కృష్ణానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ హాజరై మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చేసే పనులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలన్నారు. అంతకు ముందు సమావేశంలో ఒక్కో శాఖ నుంచి అధికారులు నివేదిక చదివి వినిపించారు. ఇరిగేషన్ శాఖ నివేదికను ఏఈ వెంకటేశ్వర్లు నివేదిక చదువుతుండగా.. ఖిల్లాఘనపురం సర్పంచు వెంకటరమణ తదితరులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఖిల్లాఘనపురం గణపసముద్రం చెరువుకు తాను చేసిన పనులకు ఇప్పటి వరకు ఎందుకు డబ్బులు రావడం లేదన్నారు. అదేవిధంగా ఆగారం , షాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లోని చెరువుల తూములకు షెటర్లు పాడై రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఏఈ మాట్లాడుతూ ఈ విషయాన్ని గతేడాది నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో వృద్ధులకు ఇచ్చే పింఛన్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతు త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మహిళా సంఘాలకు రుణాలు వచ్చిన సమయంలో ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు ఆరోపించారు. ఇక నుంచి పూర్తిస్థాయిలో సమాచారం ఇస్తామని ఐకేపీ ఏపీఎం నాగమణి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామయనాయక్, ఎంపీడీఓ విజయ్ కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



పౌష్టికాహారం అందిస్తున్న నాయకులు

అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగు ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరితంగా క్షయవ్యాధి నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ నిస్సార్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్టు ద్వార ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయం అన్నారు. క్షయవ్యాధి వచ్చిందని కంగారు పడి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ఆరు నెలల పాటు వైద్యులు సూచించిన ప్రకారం మాత్రలు వేసుకుంటే వ్యాధి నుంచి త్వరితంగా కోలుకుంటారన్నారు. వ్యాధిగ్రస్తుల పేర్లు గోప్యంగా ఉంచుతారని, ఇతరులతో మాట్లాడే సమయాల్లో మాస్కులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సార్‌అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాం పాషా, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



గోపాల్‌పేట వరి కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గోపాల్‌పేట: రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా గోపాల్‌పేటలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, హమాలీలు కక్ష్యగట్టినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం హమాలీలు కేవలం రెండు గంటలు మాత్రమే కాంటా చేసి వెళ్లి పోవడంతో రైతులు వరి కొనుగోలు కేంద్రంలో నిరసన తెలిపారు. ఇన్నిరోజులు వర్షం వచ్చి మేము ఇబ్బందులు ఎదుర్కొంటే బుధవారం నుంచి ఎండలో ఉన్నా కూడా హమాలీలు కేవలం రెండు గంటలు పనిచేసి వేరే దగ్గరికి వెళ్లిపోతే మేము ఎవరితో చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా హమాలీలు వినడం లేదని అన్నారు. గోపాల్‌పేటలోని కోదండరామస్వామి ఆలయం ముందు ఉన్న వరికొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం వందకు పైగా వడ్ల రాశులు ఉన్నాయని, హమాలీలు రోజుకు రెండు గంటలు పనిచేస్తే ఎన్ని రోజులని ఆగాలని ప్రశ్నించారు. ఇప్పటికే వర్షం కురిసి వడ్లు మొలకెత్తాయి. అయినా ఆరబెట్టాం కానీ కాంటా చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హమాలీలు వచ్చి ధాన్యం కాంట చేసేవిధంగా చూడాలని అన్నారు. లేదంటే శనివారం రైతులందరం కలిసి జిల్లా కేంద్రంలో ధర్నాకు దిగుతామని అన్నారు.

సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనాపురం: సీనియర్ మేటీలను ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, ఉపాధిహామీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు గురువారం మదనాపురం ఎంపీడీఓ నాగేంద్రంకు వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు ఆయన గోపన్‌పేటలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. రెండు నెలల కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజుకు కూలి రూ.వంద వస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన రూ.272 ఎవరికి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొలతలతో సంబంధం లేకుండా అందరికీ రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రామచందర్, సురేష్, మోహన్, భాస్కర్, లక్ష్మణ్ నాయక్, నరసింహాగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం



మాట్లాడుతున్న అజయ్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఏఓల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి ప్రదర్శించడం తగదని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమం ఆగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద గురువారం ఐకేపీ వీఓల నిరవధిక సమ్మెలో పాల్గొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చల పేరిట కాలాన్ని గడిపేస్తుందన్నారు. వీవోేల సమస్యలు నెరవేర్చకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సీఐటీయూ నాయకులు సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో పావని, రంగన్న , పావని, రంగన్న, రాధ పాల్గొన్నారు.

ఇరుకైన స్థలంలో సంత నిర్వహణ



అమరచింత పెద్దపీర్ల మసీదు సమీపంలో ఇరుకైన దారిలో కొనసాగుతున్న సంత

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో సంత బజారు నిర్వహించే ప్రదేశం ఇరుకైన రహదారి కావడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత సంత బజారు ఇతర ప్రదేశానికి మారుస్తామన్న అధికారులు ఇప్పటికీ సంత బజారు సమస్యను పరిష్కరించలేక పోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర వస్తువులను అమ్మడానికి వస్తున్న వర్తకులు తహసీల్దార్ కార్యాలయ ప్రధాన రహదారికి ఇరువైపులా కూర్చొని అమ్మకాలు జరపడంతో వాహన రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంత బజారు సమస్యలు పరిష్కరించాలని, సంత బజారులో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.